www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 జులై 2024

5

తూర్పుగోదావరి



జిల్లా ఎస్‌పిగా డి.నరసింహ కిషోర్

నూతన ఎస్‌పి కిషోర్

ప్రజాశక్తి రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా నూతన ఎస్‌పిగా డి.నరసింహ కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు సిఎస్ నీరబ్ కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2013 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన నరసింహ కిషోర్ ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది పోలీసు ఉన్నతాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం ఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించిన పి.జగదీష్‌ను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉద్యోగులకు 'కూటమి' టోకరా.!

- జిపిఎస్ జిఒ విడుదలపై ఆగ్రహం
- ఒపిఎస్ కోసం పట్టుబడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సిపిఎస్‌ను తొలగించి ఒపిఎస్‌ను అమలు చేయాలని కొన్నేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల ముందు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత హామీను నిలబెట్టుకోలేకపోయారు. అందుకే మొత్తం ఉద్యోగులు వైసిపి ప్రభుత్వం గద్దె దిగే వరకూ పోరాటాలు చేశారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూటమి ముఖ్య నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే జిపిఎస్‌ను పునఃసమీక్షిస్తామని చెప్పుకొచ్చారు. మ్యానిఫెస్టోలో కూడా హామీని పొందుపరిచారు. కూటమి నేతల నిర్ణయంతో ఉద్యోగులంతా సంతోషించారు. తమ కష్టాలు తీరుతాయని భావించారు. తీరా సిపిఎస్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్)లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 అక్టోబర్ 20 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది. జిపిఎస్ అమలు చేస్తూ జూన్ 12న జిఒ 54ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జిఒ బయటకు రాలేదు. ఇప్పుడు జిపిఎస్ చట్టం అమల్లోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ గెజిట్ విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం కూడా టోకరా ఇవ్వడంతో అంతా తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఏళ్ల తరబడి ఆందోళన

108 ప్రభుత్వ శాఖల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీస్, నర్సింగ్, సచివాలయాల సిబ్బందితో కలిపి రాష్ట్ర వ్యాప్తగా 4 లక్షల 20 వేలు మంది సిపిఎస్ ఉద్యోగులున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 21,800 మంది పని చేస్తున్నారు. సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగులు ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో తమ నిరసన గళం వినిపించారు. గత ప్రభుత్వ హయాంలో అనేకసార్లు ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు చేపట్టి అధికారులు, పాలకులకు వినతి పత్రాలు అందించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జగన్ ఇచ్చిన హామీను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయినా నాటి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులంతా ఏకతాటిపై నిలబడి కూటమి ప్రభుత్వానికి మద్దతు పలికారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తుందని ఆశలతో ఉన్నారు. తాజాగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి గత పాలకుల మాదిరిగానే జిపిఎస్‌నే అమలు చేస్తామని చెప్పడంతో తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు.

జిపిఎస్‌కు పూర్తి వ్యతిరేకం

గత ప్రభుత్వం మోసం చేయడంతోనే మొన్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటే జిపిఎస్‌ను అమలు చేస్తామని చెబుతున్నారు. ఒపిఎస్‌ను సాదించటానికి సిపిఎస్ ఉద్యోగులు అందరు కలసి మరింత తీవ్రంగా పోరాటం చేస్తాం.

- వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఒపిఎస్‌తోనే సమస్యకు పరిష్కారం

సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఎప్పటికప్పుడు ధరలు పెరుగుతున్న సందర్భాల్లో పెన్షన్ కూడా పెరగాల్సి ఉంది. ఒపిఎస్‌లో ఉండే రక్షణ సిపిఎస్‌లోగాని, జిపిఎస్‌లోగాని ఉండే అవకాశం లేదు. కావున కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఒపిఎస్‌ను అమలు చేయాలి.

- డాక్టర్ ఎం.రవికుమార్, సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట గౌరవాధ్యక్షుడు.

అనుకూల నిర్ణయం తీసుకోవాలి

ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అనుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంవత్సరంలోపు రివ్యూ చేసి ఉద్యోగులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఇప్పుడు జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తామంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదు. గత ప్రభుత్వం చేసిన తప్పుని చేస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

- ఎస్ కె.బాషా, జిల్లా అధ్యక్షుడు, సిపిఎస్ ఎంప్లాయిూస్ అసోసియేషన్.

రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

గెజిట్ నోటిఫికేషన్‌పై యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంపై యుటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. కంబాల చెరువు వద్ద మానవహారం నిర్మించి, గెజిట్ ప్రతులను దగ్ధం చేశారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిపిఎస్ చట్టాన్ని రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష నెరవేరుస్తామన్న ప్రస్తుత ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులతో చర్చించకుండా జిపిఎస్ అమలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించిందని, పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా గతంలో జిఒను విడుదల చేయలేదని తెలిపారు. ఇప్పుడు పాత తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చుటమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, జిల్లా సహాధ్యక్షురాలు ఎం.విజయగౌరి, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, ఎం.రవిబాబు, టిఎస్.ప్రకాశరావు, ఇ.శ్రీమణి, ఎం.రమేష్ బాబు, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు .

స్టేడియం ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక 50వ డివిజన్ గాంధీపురంలో రూ.2.34 కోట్లతో నిర్మించిన ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంను ఎంఎల్‌ఎ ఆది రెడ్డి వాసు.. మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, స్థానిక నాయకులు అధికారులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వాసు మాట్లాడుతూ శారీరిక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా విద్యార్థులు బ్యాడ్మింటన్ క్రీడ పట్ల తమ ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు నూతనంగా నిర్మించి ప్రారంభించుకుంటున్న ఇండోర్ స్టేడియం చక్కని వేదిక కానుందన్నారు. క్రీడల పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరూ జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చక్కని అవకాశాలు కల్పిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. భారతదేశంలో షటిల్ బ్యాడ్మింటన్‌తో పాటు అన్ని క్రీడలకు ప్రభుత్వం మంచి మద్దతు నిస్తుందన్నారు. క్రీడల ప్రాధాన్యతను గుర్తిస్తూ రాజమహేంద్రవరంలో కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలో మూడు షటిల్ కోర్టులు ఉంటాయని తెలిపారు. బ్యాడ్మింటన్ ఆడుకునేందుకు వచ్చిన క్రీడాకారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపి.నారాయణ, డిఇ పి.ప్రసాద్, ఎఇ జి.షర్మిల, ఎస్ఇ జి.పాండురంగారావు అనుశ్రీ, సత్యనారాయణ, రవి యాదవ్ పాల్గొన్నారు.

జిపిఎస్ జిఒ విడుదల దుర్మార్గం

ప్రజాశక్తి - ఉంద్రాజవరం, తాళ్లపూడి

జిపిఎస్‌పై చడీ చప్పుడు లేకుండా ప్రభుత్వం జిఒ విడుదల చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ ఉంద్రాజవరం మండల శాఖ అధ్యక్షుడు కుంకట్ల వెంకటరత్నం విమర్శించారు. ఎన్నికల హామీలలో భాగంగా సిపిఎస్‌పై ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని అమలు పరుస్తామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి విరుద్ధంగా చడీ చప్పుడు కాకుండా గత ప్రభుత్వం తయారుచేసిన జిపిఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ఈ విధానం వల్ల ఉద్యోగులు చాలా నష్టపోతారని, దీనిపై పునఃసమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగస్తులందరితో చర్చించిన మీదట అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, మండల గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

తాళ్లపూడిలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, కార్యదర్శి పి.సువర్ణ రాజు విలేకరులతో మాట్లాడారు. జిపిఎస్ విధానం సిపిఎస్ కంటే ఘోరమైనదని, నూతన ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి చెప్పకపోతే గత ప్రభుత్వానికి ఇచ్చినట్టే రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడానికి ఇప్పటి నుండే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే జిపిఎస్ అమలును ప్రకటిస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో సిపిఎస్, జిపిఎస్‌లపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పినప్పటికీ ఎటువంటి సమీక్ష లేకుండా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దారుమన్నారు.

వర్షాలపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అధిక వర్షాల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. వ్యవసాయ పంటల్లో ముఖ్యంగా వరి పంట 90 సాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 52 శాతం వరినాట్లు పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వర్షానికి పంటలలో ఎటుఒంటి నష్టము లేదని, కానీ అధిక వర్షానికి రైతాంగం, తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక నీటిని పంట నుంచి బయటకు పోయే విధముగా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం తగ్గే వరకు వరినాట్లు తాత్కాలికంగా ఒకటి, రెండు రోజులు నిలుపుదల చేసుకుంటే నారు వధాను అరికట్టుకోవచ్చున్నారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పదో తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్ ఫెయిల్ అభ్యర్థులకు ఐటిఐలలో ప్రవేశం కోసం 2024-25 సంవత్సరానికి రెండో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎల్ఆర్ఆర్.క్రిష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5:00 గంటల్లోపు దరఖాస్తు చేసుకుని రసీదు పొందాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక జత జిరాక్స్ కాపీలతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందవలెనని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఐటిఐలోనే రిజిస్ట్రేషన్ కౌంటర్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మహిళకు బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాస్

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విలువైన బంగారు నగలతో ఆటోలో ఒక మహిళ బ్యాగ్ మరిచిపోగా దాన్ని ఆమెకు భద్రంగా అందజేసి ఒక ఆటో డ్రైవర్ నిజాయతీ చాటుకున్నారు. కెఎల్.శిరీష అనే వివాహిత శుక్రవారం తాడేపల్లిగూడెం నుండి వైజాగ్ వెళ్లే నిమిత్తం ట్రెయిన్ ఎక్కారు. తన భర్త రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్ వద్ద ఉండడంతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో దిగి, ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు వెళ్ళడం కోసం రైల్వే స్టేషన్ వద్ద ఆటో ఎక్కారు. కాంప్లెక్స్ వద్ద ఆటోలో ఉన్న తన బ్యాగును మర్చిపోయి వెళ్లిపోయారు. అనంతరం గమనించి రాత్రి ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ కెవిఎస్.సత్యనారాయణ సిసి కెమేరాలను పరిశీలించి వాట్సప్ గ్రూపులలో మెసేజ్ పెట్టారు. శనివారం ధవళేశ్వరం కంచరలైన్‌కు చెందిన ఆటో డ్రైవర్ కురందాసు శ్రీనివాస్ వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన మెసేజ్ చూసి తన ఆటోలో వెనుక ఉన్న మహిళ బ్యాగ్‌ను గుర్తించారు. దీంతో ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో సౌత్ జోన్ డిఎస్‌పి ఎం.అంబికా ప్రసాద్ సమక్షంలో మహిళలకు బ్యాగ్ అందజేశారు. ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌ను పోలీసు అధికారులు, మహిళ కుటుంబ సభ్యులు అభినందించారు. డ్రైవర్ శ్రీనివాస్‌కు వారు రూ.5,000 బహుమతి అందించారు.

వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం

శనివారం కురిసిన వర్షంతో జిల్లాలో పలుచోట్ల జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. రాజమహేంద్రవరం నగరం చిన్నపాటి వర్షానికే ముంపునకు గురయ్యింది.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం ప్రతినిధి వర్షాల నేపథ్యంలో రాజమహేంద్రవరం నగరం ముంపు బారిన పడింది. సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు 22, 36 డివిజన్‌లలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. చిన్నపాటి చినుకు పడితే చాలు నగరంలోని అనేక వార్డుల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. రోడ్ల వెంబడి గుంతలు, వర్షపు నీరు ప్రవహించేందుకు మురికి కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి రోడ్లవెంట ప్రయణించాలంటేనే ప్రజలు నానా అవస్థలూ పడాల్సి వస్తోంది. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలు, మురికివాడలు, శివారు కాలనీల్లో మాత్రం ఈ సమస్య తీవ్రంగా ఏర్పడుతోంది. నగరంలో కంబాల చెరువు వద్ద పేరుకుపోయిన మట్టిని, చెత్తను పూర్తిస్థాయిలో తీయకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపై పారుతోంది. పేపర్ మిల్లు మొదలుకొని ఆర్యాపురం వరకు చిన్నపాటి వర్షాలకే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. లలితా నగర్ హుకుంపేట, బాలాజీ నగర్ ప్రాంతాల్లో మురుగునీరు దాటికి తీవ్ర దుర్గంధం, ఈగలు, దోమలతో ప్రజలు అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస చొరవ చూపించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో అభివృద్ధి పేరుతో వందల కోట్లు గత ప్రభుత్వ హయాంలో వెచ్చించారు. నగరంలో సెంట్రల్ జైలు రోడ్డు, ఎవి.అప్పారావు రోడ్డు, జెఎన్ రోడ్లలో మాత్రమే కొంతమేర అభివృద్ధి పరిమితమైంది. అనేకచోట్ల రహదారులు విస్తరించకుండా డివైడర్లు ఏర్పాటు చేశారు. పెరుగుతున్న రద్దీ తగినట్లుగా రహదారులు లేకపోవడం, డివైడర్లు ఏర్పాటు చేయడంతో బస్ కాంప్లెక్స్ ఏరియా, ఎవి అప్పారావు రోడ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధాన వీధుల్లో ఒకటైన శ్యామల నగర్, స్టేడియం రోడ్డు ప్రధాన రైల్వే స్టేషన్ ఏరియా, బస్ కాంప్లెక్స్, కంబాల చెరువు, లలిత నగరలో మురికి కాల్వల ఆధునీకరణకు నోచుకోవడం లేదు.

గోపాలపురంలో నీట మునిగిన ఇల్లు

గోపాలపురంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మండలంలో సుమారు 48.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. దీంతో వరద నీరుకు చెరువులు, కాలువలు నిండు కుండలా ప్రవహించాయి. వరద నీరు ప్రవహించే డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వరద అదుపుతప్పి గ్రామంలోని రోడ్ల మీద నుండి వరద ప్రవహించింది. ఇళ్లల్లోకి చేరింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. కోమటికుంట, వాదాలకుంట గ్రామాల నుండి వరద ప్రవాహం అయ్యింది. ఉప్పరగూడెం నుండి గ్రామ పంచాయతీ వెనుక వీధి వరకు పులు గ్రామాల నుండి వచ్చే వరద నీరు ప్రవాహం భారీగా వెళుతుంది. పంచాయితీ వెనక వీధిలో శివాలయం సమీపంలో నుంచి సిమెంట్ రోడ్డు మీద సుమారు 200 మీటర్ల వరకు వరద నీరు ప్రవహించింది. దీంతో ఇళ్లల్లో వారు రోడ్లపైకి వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడ్డామని తెలిపారు. మోతినవారి చెరువు నిండిపోవడంతో వరద నీరు అత్యధికంగా ప్రవహించింది. ఆ వరద నీరు రజకుల ప్రాంతానికి చేరింది. రజకుల ప్రాంతంలో శ్మశాన వాటిక సమీపంలో వరద ఉధృతంగా ప్రవహించడంతో అక్కడే ఏర్పాటు చేసుకున్న రజకుల గుడిసెల్లోకి నీరు చేరింది. గోపాలపురం మోతినవారి చెరువు, నక్కిర్లమ్మ చెరువు, గంగాలమ్మ చెరువు నిండిపోయాయి.

తాళ్లపూడిలో నీట మునిగిన వరి నారుమడులు

తాళ్లపూడిలో 41.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. భారీ వర్షం కారణంగా పలు గ్రామాల్లోని పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. ఈ నీరు బయటకు పోయే మార్గం లేక రైతులు అనే ఇబ్బందులకు గురయ్యారు. రైతుల ఇబ్బందులు అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని బయటికి పంపించే ఏర్పాట్లు రైతులు చేసుకుంటున్నారు. పైడిమెట్ట, గజ్జరం గ్రామాల మధ్య గల సంఘం చెరువు ప్రాంతంలో వరి నార్లు నీట మునిగాయి. తాళ్లపూడి, ప్రక్కిలంక, వేగేశ్వరపురంలో అంతర్గత రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

కడియం ఉదయం నుండి కురుస్తున్న వర్షానికి కడియం మండలం వేమగిరితోట ప్రాంతంలోని పలు వీధులు జలమయమై నదీ ప్రవాహాన్ని తలపిస్తున్నాయి. అధికారులు డ్రైనేజీలను శుభ్రపరచకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తే నీరు వెళ్లే మార్గం లేక కాలనీ అంతా రోగాల బారిన పడుతున్నామని, వర్షానికి కాలనీ జలమయం అయ్యిందని స్థానికులు వాపోతున్నారు. వర్షపు నీరును మహిళలు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు.

కార్టూ'నిజం'

జిల్లావ్యాప్తంగా డ్రైడే

జిల్లావ్యాప్తంగా శనివారం డ్రై డే నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం, కడియం, పెరవలి

రాజమహేంద్రవరం రూరల్ ఇన్‌ఛార్జి జెసి దినేష్ కుమార్ రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో బొమ్మూరు, కడియం గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లను పరిశీలించారు. జిల్లా స్థాయి, డివిజనల్, మండల స్థాయి అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు దిశా నిర్దేశనం చేశారు. ఆయా సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. వాటర్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్స్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్న దష్ట్యా క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అందరూ ఓవర్ హెడ్ ట్యాంక్స్, సంప్‌లు, డ్రై డే నిర్వహణా బిఫోర్ అండ్ ఆఫ్టర్ ఫొటోస్ అప్లోడ్ చేసి సర్టిఫికెట్‌ను ఆర్డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌కు పంపాలని ఆదేశించారు. **పెరవలి** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ ఉంగట రాజేష్ బాబు ఆధ్వర్యంలో ఖండవల్లి గ్రామం కోలావారి వీధిలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తులకు డెంగ్యూ డయేరియా, కామెర్లు, టైఫాయిడ్ వ్యాధుల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఉంగట రాజేష్ బాబు ఎంఎల్ హెచ్‌పి ఎం.గ్రేస్, పీసపాటి సూర్యనారాయణ, వి.దుర్గ, పి.దుర్గ జయ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కడియం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జిల్లాలో వాటర్ ట్యాంక్‌లు శుభ్రం కార్యక్రమం శనివారం చేపట్టారు. దీనిలో భాగంగా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ దినేష్ కుమార్ కడియంలోని పలు వాటర్ ట్యాంకులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికపుడు ట్యాంకులను పరిపూర్ణంగా శుభ్రం చేసి, ఆరబెట్టి తగిన చర్యలు తీసుకుని నీటిని పంపించేలా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం కావడం వల్ల తాగునీటికి ఎలాంటి సమస్యలూ లేకుండా స్థానిక అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వ్యాధులు త్వరగా ప్రబలే ఈ రోజుల్లో తాగునీరు కలుషితమైతే ప్రజలు ఇబ్బంది పడతారన్నారు. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు అందించామని, ఆయా గ్రామాల ప్రజలు కూడా వీటిని పర్యవేక్షిస్తూ భాగస్వాములు కావాలని జెసి కోరారు. పలువురు గ్రామస్తులను జెసి వాటర్ ట్యాంకులు పరిశుభ్రత, స్వచ్ఛమైన నీటిని అందించడానికి పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. మండల అధికారులతో పాటు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఎం.నాగలత, ఎస్ఇ బాలశంకర్, డిఇ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో తనిఖీ చేస్తున్న జెసి

వైద్య ఖర్చుల కోసం మానవత సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను ఆదుకోవడం మానవత సంస్థ ధ్యేయమని మండల శాఖ అధ్యక్షులు అంకెం సురేష్ అన్నారు. ఎముక ఆపరేషన్ చేయించుకుని రెండు నెలలుగా మంచానికే పరిమితమై వైద్య ఖర్చుల కోసం ఎదురుచూస్తున్న మలకపల్లి గ్రామానికి చెందిన తిరుమల అమ్మాజీకి మానవతత శాఖ శనివారం రూ.6000 సాయం అందించారు. పిహెచ్‌సి వైద్యాధికారి పి.అన్నపూర్ణ రూ.2 వేలు కలిపి రూ.8 వేల మొత్తం అమ్మాజీ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మానవత కార్యదర్శి సనపల రాజశేఖర్ మాట్లాడుతూ అనేక విధాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత సేవా సంస్థలో రూ.600 చెల్లించి ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి అప్పన హనుమంతు, జోడాల వెంకటేశ్వరరావు, సాయన సుబ్బారావు, అప్పన చంద్రగుప్త, పి.అన్నపూర్ణ, జి.మునేశ్వరరావు, సురేంద్ర పాల్గొన్నారు.

20న పెరవలి మండల సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ కె.హిమమహేశ్వరి, ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచులు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు తగు వివరాలతో విధిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

నేరాలు ఘోరాలు

22,900 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు(పిఠాపురం)

కాకినాడ నుంచి కత్తిపూడి వైపు లారీపై తరలిస్తున్న 22,900 కేజీల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తుగా విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారంతో శనివారం గొల్లప్రోలు శివారు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలను విజిలెన్స్ అధికారులు చేపట్టారు. ఈ తనిఖీల్లో కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్నన్న లారీని తనిఖీ చేయగా 458 బస్తాలలో సుమారు 22,900 కేజీల పిడిఎస్ బియాన్ని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలోని దుర్గాడ గ్రామనికి చెందిన ఉమ్మిడి కృష్ణకిరణ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ ఏరియాకి ఈ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.20,41,950 ఉంటుందన్నారు. సంబంధిత బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు పోలీసు స్టేషన్‌కు సిఫారసు చేసినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా సదరు బియ్యాన్ని కొనడం, అమ్మడం, అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు ఎస్‌ఐ జగన్నాధరెడ్డి, ఎఒ భార్గవ్ మహేష్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెట్టు పడి మోటార్ సైక్లిస్టు మృతి

ప్రజాశక్తి - పెరవలి

చెట్టు విరిగిపడి వాహనదారుడు మరణించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. చాగల్లు గ్రామానికి చెందిన మల్లుల కువలేష్ (25) ఉదయం ఇరగవరం మండలం పేకేరు బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వేలివెన్ను బైకుపై వెళుతుండగా ఖండవల్లి జాతీయ రహదారి పౌల్ట్రీ వద్ద రహదారి ప్రక్కన ఉన్న చెట్టు కూలి కువలేష్‌పై పడటంతో తలకు బలమైన గాయం అయ్యింది. దీంతో తణుకు జిల్లా ప్రాంతీయ జనరల్ హాస్పిటల్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందినట్టు మేనమామ బొక్కా శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎజిఎస్.మూర్తి తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

బైక్‌పై వెళుతూ ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం అనంతపల్లి సమీపంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సిఐ కె.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా చీరాల సమీపంలోని జాండ్రపేటకు చెందిన కె.సంతోష్ కుమార్ రాజమండ్రి వైపు నుండి విజయవాడ వైపు బైకుపై వెళుతున్నాడు. అనంతపల్లి హైస్కూల్ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో వెనుక భాగంలో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

స్వగ్రామం చేరిన అవినాష్ మృతదేహం

ప్రజాశక్తి - గోపాలపురం

చిట్యాల గ్రామానికి చెందిన గద్దె సాయి సూర్య అవినాష్ ఉన్నత చదువులు చదివేందుకు అమెరికా వెళ్లి ఈ నెల 8న తేదీన అమెరికాలోని చికాగో రాష్ట్రంలో వాటర్ ఫాల్స్‌కి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. దీంతో సాయి సూర్య అవినాష్ మతదేహం సుమారు 6 రోజుల తరువాత శనివారం చిట్యాల గ్రామానికి చేరుకుంది. కుమారుడి మతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, కన్నీటి పర్యంతమయ్యారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఉసులుమర్రులో శనివారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎజిఎస్.మూర్తి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,170 నగదు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి వంతెనపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పటవల పంచాయతీ రామన్నపాలెం గ్రామానికి చెందిన పాలెపు ప్రసాద్‌కి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి నుంచి రామన్నపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ప్రసాద్‌ను ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ప్రసాద్ ను స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఎస్ఎస్ఎల్‌సి విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లూథరన్ హైస్కూల్లో ఎస్ఎస్ఎల్‌సి 1967 - 68, 1968 - 69 బ్యాచ్‌ల విద్యార్థులు శనివారం తాము చదువుకున్న హైస్కూల్లో కలిసి తమ ఆనందాలను, అనుభూతులను పంచుకున్నారు. ఈ రెండు బ్యాచ్లో చదువుకున్న వారు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విశ్రాంత ఉద్యోగులు, ఇతరులు సుమారు 80 సంవత్సరాల వయసులో కలుసుకోవటం వారిలో ఆనందాన్ని నింపింది. వీరందరూ తాము చదివిన లూథరన్ హైస్కూల్ పాఠశాలకు వెళ్లి కొంత సమయం గడిపి అనంతరం రాజుగారి వీధిలోని ఆర్యవైశ్య సేవా సంఘం మట్టే వారి కల్యాణ మండపంలో సాయంత్రం వరకు గడిపి ఆత్మీయతను, ఆనందాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్తలు మట్టే సత్యప్రసాద్, గోలి రామారావు, విశ్రాంత ఉద్యోగులు బద్ది కృష్ణ, విద్యాసాగర్, థామస్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై ఆశలు... ఆవిరి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఉచిత ఇసుక హామీ నేతి బీర చందంగా మారిందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు టిడిపి అధినేతగా చంద్రబాబు నాయుడు ఇసుకను ఉచితంగా అందజేస్తామని చెప్పిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ వారం ప్రారంభంలో ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే నూతన సర్వత్రా పెదవి విరుస్తున్నారు. ఇసుక టన్ను ధరతోపాటు రవాణా ఛార్జీలు కలిపి లెక్కిస్తే గత ప్రభుత్వం పంపిణీ చేసిన ధరకు స్వల్ప వ్యత్యాసం ఉండటమే ఈ దుస్థితికి కారణం. గత ప్రభుత్వం హయాంలో ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. దీంతో ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న 26 రకాల మృత్తుల వారికీ జీవనోపాధి కష్టతరమైంది. ఈ పరస్థితులలో నూతన ప్రభుత్వంపై నిర్మాణ రంగంలోని వివిధ వర్గాలు అనేక ఆశలు పెట్టుకున్నాయి. ప్రభుత్వ ప్రకటనతో ఆ ఆశలన్నీ ఆవిరయ్యాయి. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు

ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొనసాగుతున్న అడ్మిషన్ల దందా

విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పడుతున్నాయి. ఎల్‌కేజీ విద్యార్థికి కనీసంగా రూ.20,000 ఫీజులు వసూలు చేయటంతోపాటు పుస్తకాలు, బస్‌ఛార్జీల పేరుతో మరో రూ.10,000 యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలల స్థాయిని బట్టీ రూ.50,000 నుంచి రూ.1,00,000 వెచ్చించక తప్పడం లేదు. అదేవిధంగా ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.1,00,000 నుంచి రూ.1.50,000 చొప్పున వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షం... హర్షం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు హర్షం వ్యక్తమవుతోంది. దాదాపుగా 50 శాతం నాట్లు పడినట్లు తెలుస్తోంది. మరో వారం రోజులలో 100 శాతం లక్ష్యం చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెట్టుబడిసాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వర్షం వస్తే.. ప్రయాణం కష్టమే...

ప్రజాశక్తి - తాళ్లరేవు

నిత్యం రద్దీగా ఉండే తాళ్ళరేవు సంతపేట, జాతీయ రహదారి 216లను కలిపే పరదేశమ్మ వీధి వర్షం వస్తే ప్రయాణించడం కష్టతరంగా మారింది. ఈ వీధిలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచి ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది. రోడ్డుపై అధిక స్థాయిలో నీరు నిలిచి కాలువను తలపిస్తుంది. వాహనాలపై వెళ్లేవారు రోడ్డు ఎంతవరకు ఉందో తెలియక పక్కనున్న డ్రెయినేజీలో పడి ప్రమాదాల భారిన పడుతున్నారు. వీధిలో రక్షిత మంచినీటి చెరువులో ఫిల్టర్ అయిన తర్వాత వదిలే వ్యర్థజలాలు ఇదే డ్రెయినేజీ లోంచి వెళ్లాల్సివుంది. గతంలో ఈ డ్రెయినేజీ మురుగునీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువలోకి వెళ్లిపోయేది. ఇటీవల కాలంలో జాతీయ రహదారి చెంతన లేఅవుట్లు విస్తరించడంతో కాలువలు మూసివేసి లేఅవుట్లు వేశారు. దీనివల్ల పరదేశమ్మ వీధి ప్రారంభం నుంచి పెట్రోల్ బంక్ వరకు ఉన్న కాలువకు పలుచోట్ల అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో పరదేశమ్మ వీధి నుంచి వచ్చే మురుగు నీరు ఎటూ వెళ్లక డ్రెయినేజీలోనే ఉండిపోతుంది. మురుగునీటికి వర్షపు నీరు తోడయితే ఆ వీధిలో వెళ్లే వారు మోకాలు లోతు నీటిలో వెళ్ళవలసి వస్తుంది. దీనిపై పంచాయతీ అధికారులు, ఆర్ అండ్ బి, 216 ఎన్‌హెచ్ అధికారులు దృష్టి సారించి మురుగునీరు బయటకు పోయేందుకు అవసరమైన శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అస్థవ్యస్థంగా జగనన్న కాలనీ

ప్రజాశక్తి - పెదపూడి

కాలనీకి వెళ్లు రోడ్డుపై జారిపడుతున్న వాహనదారులు

మండలంలోని గొల్లల మామిడాడ జగనన్న కాలనీ అస్థవ్యవస్థంగా మారింది. సరియైన రోడ్డు లేకపోవడంతో వర్షానికి కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కాలనీకి వెళ్లే మార్గం బురదమయంగా మారిపోయింది. దీంతో కాలనీకి చెందిన వారు బురదమయం అయిన రోడ్డు వెంబడి ప్రమాదాలకు గురౌతున్నారు. స్కూల్ వ్యాన్‌లు ఆ బురదలో దిగబడిపోవడంతో విద్యార్థులు అదే బురదలో పడుతూ..లేస్తూ రావాల్సిన పరిస్థితి నెలకుంది. రోడ్డుతో పాటు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు ఎక్కడిదక్కడే నిలిచిపోతుంది. పైగా గృహాల్లో వినియోగించిన వ్యర్థ జలాలు వీధుల్లోనే చేరుతోంది. దీంతో అపరిశుభ్రతతో కాలనీ దర్శనమిస్తోంది. ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయాయి. దీంతో అనేక మంది రోగాలు భారిన పడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రోటోకాల్ పాటించకపోవడం శోచనీయం

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రోటోకాల్‌ను పాటించాల్సిన అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల చులకనగా చూడటం శోచనీయమని టిడిపి పట్టణ టిడిపి కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రారంభించే క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం అనేది రివాజు అని, అయితే శుక్రవారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కందిపప్పు, బియ్యం అందించే కార్యక్రమంలో తనను నిర్లక్ష్యం చేశారని మీడియా తో అన్నారు. స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రోటోకాల్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినా అధికారులు పెడచెవిన పెడుతున్నారని అన్నారు. తన వార్డులో జరిగిన ప్రజాపంపిణీ కార్య క్రమానికి సంబంధించి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జనసేన పార్టీ నాయ కులతో కార్యక్రమాన్ని నిర్వహించడం సరికా దన్నారు. ఇదే అంశంపై తహశీల్దార్‌ను ప్రశ్నించగా టిడిపి కౌన్సిలర్ ఉన్నారా? అని అనడం బాధాకరమని అన్నారు.నగేష్ కోరారు.

నీట మునిగిన నారుమడులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల నారుమల్లు, ఎద జల్లిన చేలు నీట మునిగాయి. మురుగు కాలువలలో పూడిక తీసే పనులను డ్రెయినేజీ శాఖ పట్టించుకోకపోవడంతో వ్యవసాయ పొలాల్లో నీరు నిలిచిపోయిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముత్యాలమ్మ గుడి ప్రాంతం, మాధవరాయనిపేట ప్రాంతాల్లో సుమారు 50 ఎకరాలు పూర్తిగా నీట మునిగింది. ఆ ప్రాంత రైతాంగం యంత్రాలతో శనివారం మురుగు కాలువల్లో పూడికను తీసి పొలాల్లో నీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆనుకుని ఉన్న మురుగు కాలువ కొన్నాళ్లగా మూసుకుపోయిందని, భవన సముదాయాల నిర్మాణాలతో పలుచోట్ల మురుగు కాలువ ఆక్రమణకు గురికావడంతో మురుగు కాలువను పూర్తిగా బాగు చేయలేకపోతున్నామని రైతులు వళ్ల చిన్న, రామకృష్ణ వాపోయారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మురుగు కాలువపై ఆక్రమణలను తొలగించాలని కోరారు.

యానాం వార్తలు

ఎంఎల్ఎ అశోక్‌ను ఆహ్వానిస్తున్న విద్యాశాఖ అధికారి

15న విద్యార్థుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 15న కామరాజ్ నాడార్ జయంతిని జాతీయ విద్యార్థుల దినోత్సవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు యానాం విద్యాశాఖాధికారి పంపిన లక్ష్మణప్రవీణ్ శనివారం తెలిపారు. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో సోమవారం విద్యార్థులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొంటారని తెలిపారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

నేడు నర్సింగ్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించే బిఎస్‌సి నర్సింగ్ ప్రవేశ పరీక్షకు యానాం నుంచి 62 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రంగా స్థానిక రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం ఆర్ఎఒ మునిస్వామి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. అభ్యర్థులు ఉదయం 8:30 గంటలకే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఆలయానికి రూ.3.46 లక్షల ఆదాయం

యాత్రికులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.3.46 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. వివిధ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,56,900, అన్నదాన విరాళాల ద్వారా రూ.52,361, కేశఖండన ద్వారా రూ.6,600, తులాభారం ద్వారా రూ.250, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.30,060 ఆదాయం లభించిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు,పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు.

వ్యాధుల నిర్మూలనకు ఇంటింటా సర్వే

ప్రజాశక్తి-అంబాజీపేట

అతిసారం, టైఫాయిడ్ తదితర వ్యాధులపై పిహెచ్‌సి సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పిహెచ్‌సిల ఆధ్వర్యంలో డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా తాగునీటి వినియోగంలో బ్యాక్టీరియా వ్యాప్తిపై సర్వే నిర్వహిస్తున్నారు. ఇంకోలై అనే బ్యాక్టీరియా నిర్ధారణ సర్వేలో భాగంగా ఆర్‌డబ్ల్యుఎస్ నీరు, ఆర్ఒ ప్లాంట్ నీరు ఎంత వరకు సురక్షితమో నిర్ధారణ చేసే పరీక్షలలో 24 గంటల్లో బ్యాక్టీరియా ఉంటే నీరు నల్ల రంగులో మారితే బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ఆ నీరు వాడకూడదని కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తాగునీరులో క్లోరిన్ శాతం ఎంత ఉంది అనేది ఈ పరీక్షలలో తెలుస్తుంది. అందులో భాగంగా డయేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికి రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం అత్యవసర సమయంలో అనా రోగ్యం, విరేచనాలు ఉంటే వైద్యుల దగ్గరకు వెళ్లే లోపు ప్రమాద బారిన పడకుండా ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఏ విధంగా వాడాలి, కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచిస్తున్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా శుభ్రం చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారికి జింక్ టాబ్లెట్లను ఇస్తున్నారు. ఫీవర్ సర్వేలో భాగంగా ఎవరైనా జ్వరం ఒంటి నొప్పులు, తలనొప్పి, జలుబు లక్షణాలు ఉంటే కార్పొరేట్ హాస్ప టల్, ప్రయివేటు లాబ్ లకు కు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసేదందుకు ఇంటి వద్దే మలేరియా కిట్లతో రక్త పరీక్షలు నిర్వహించి వాటి తీవ్రతను నిర్ధారిస్తున్నారు. ప్రభుత్వ వైద్య

డెంగీ, మలేరియా రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సూచనలను పరిగణలోకి తీసుకుని ఆర్థిక ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సీజనల్ వ్యాధులపై ఆందోళన చెందవద్దు

వర్షాకాలం సీజన్ వ్యాధులపై ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పిహె చ్‌సిలఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వేను సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఇంటి పరిస˘రాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైె నా వ్యాధి లక్షణాలుంటే పిహెచ్‌సి వైద్యులను సంప్ర దించి వ్యాధి నిర్ధారణ చేసుకుని మెరుగైన వైద్యం పొందవచ్చన్నారు.

- వి.గౌతమి, పిహెచ్‌సి వైద్యాధికారి, అంబాజీపేట

పైడా ఉపాధ్యాయులకు ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఆంధ్రప్రదేశ్ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో మండలంలోని పటవల పైడా విద్యాసంస్థల ఉపాధ్యాయులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ పైడా సత్య ప్రసాద్ తెలిపారు. ఈ ఫలితాలలో ఉపాధ్యాయిని దాక్షిణ్య భావన రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిందని, ఎస్‌విఎన్.సురేష్, కె.ప్రనూష వరుసగా 11వ ర్యాంకు, సహిర బేగం 32వ ర్యాంకు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన ఉపాధ్యాయులకు ఛైర్మన్ సత్యప్రసాద్, సెక్రటరీ పైడా సత్య శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ నిత్యా శ్రీరామ్ అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - తాళ్లరేవు

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన చొల్లంగిపేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని కురాటి పూర్ణషర్మిలను పలువురు అభినందించారు. శనివారం జరిగిన అభినందన సభలో ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ విద్యార్థిని షర్మిల తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, ఉపాధ్యాయులు హైమావతి, పూర్ణ, కనకావతి, ప్రవతి, రోహిణి విద్యార్థిని తండ్రి కూరాటి వాసు పాల్గొన్నారు.

న్యాయం కోసం కుటుంబికుల ఆందోళన

ప్రజాశక్తి - పిఠాపురం

తమ కుమార్తెకు న్యాయం చేఆయాలని పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలవద్ద కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుమార్తె ఎస్.అమృత స్థానిక గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువు తోందన్నారు. పాఠ్యాంశాలు సరిగా చదవలేదని నెపంతో గత ఏడాది డిసెంబర్ నెలలో ప్రిన్సిపల్ త్రివేణి, పిఇటి ఉమవాణిశ్రీలు 24 గంటలసేపు ఒక గదిలో నిర్బంధించి హింసించారని చెప్పారు. కర్రతో కొట్టడంతో నడుము, తలపై బలమైన గాయాలు తగిలి స్పృహ తప్పి పడిపోయిందని, దీంతో కొందరు ఉపాధ్యాయులు వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లి చేతులు దులుపుకున్నారన్నారు. అప్పటి నుంచి తమ కూతురు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. శనివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు విద్యార్థిని తల్లీ రమణమ్మ వెల్లడించింది.

వైద్య సిబ్బంది కృషికి సహకరించాలి: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం

కుష్ఠ వ్యాధి సమాజం నుంచి తరిమివేసేందుకు వైద్య సిబ్బంది చేస్తున్న కృషికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఈనెల 18న జరిగే కుష్ఠ వ్యాధి నివారణ దినోత్సవ పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే కుష్ఠ వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమానికి సహకరించాలన్నారు.

త్యాగరాజు భవన నిర్మాణ పనులు పున:ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్, ఎంపీ బోస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొంత కాలంగా ఆగిపోయిన పనులను తిరిగి రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్ర బోస్ ఎంపీ నిధులు మంజూరు చేశారు. దీంతో పున:ప్రారంభించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ పిల్లి సుభాష్ చంద్ర బోస్, పిల్లి సూర్యప్రకాష్ లు పాల్గొన్నారు. త్యాగరాజ సంగీత సభ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ శిష్ట అమ్మన్న పంతులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా తదుపరి పూజా కార్యక్రమంలో వీరంతా పాల్గొన్నారు. ట్రస్ట్ సెక్రటరీ తటవర్తి శ్రీనివాస్ సభ యొక్క చరిత్రను తెలియజేస్తూ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయమని మంత్రిని కోరారు. వైసిపి ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, టిడిపి ఎంఎల్ఎ మంత్రి అయిన వాసంశెట్టి సుభాష్ ఎన్నికల అనంతరం మొదటిసారి పట్టణంలోని ఒక కార్యక్రమంలో కలుసుకున్నారు. ఎన్నికల అనంతరం శనివారం కలిసిన వీరంతా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎంతో ఉత్కంఠ వాతావరణంలో సాగిన కలయికకు ఇరు పార్టీల అభిమానులు చెవులు ఇరికించి మరీ ఆసక్తిగా గమనించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోదావరికి వరద నీరు

ఎరుపు రంగును సంతరించుకున్న గౌతమీ గోదావరి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరద నీరు రావడంతో ఎరుపు రంగు సంతరించుకుంది. ప్రతి ఏటా ఆగస్టులో గోదావరి నీరు వస్తు ంది. దీంతో అప్పటి వరకు ఉన్న నీలిరంగు నీరు సముద్రంలోకి కొట్టుకుపోయి ఎరుపు రంగు సంప్రదించుకుంటుంది. డిసెంబర్ వరకు ఎరుపు రంగులో ఉండే గోదావరి తదానంతరం జూన్ వరకు నీలిరంగులో ఉంటుంది. ఎరుపు రంగు వరద నీరు గోదావరిలోకి ప్రవేశించిన వెంటనే సముద్రం నుండి పులస చేపలు గోదావరిలోకి వలస వస్తాయి. రాష్ట్రంలోనే ఎంతో గిరాకీ ఉన్న చేపల్లో పులస చేప ప్రథమ స్థానంలో ఉంటుంది. దీంతో మత్స్యార్లు గోదావరిలోకి ఎరుపు నీరు రాగానే సంబరపడుతుంటారు. ఇక జూలై నెల నుంచి నవంబర్ వరకు గోదావరిలోకి పులస చేపల వలస రావడంతో మత్స్యకారులకు రూ.వేలు ఆదాయం నిత్యం సమకూర్తుంది. దీంతో మత్స్యకారులంతా పులస చేపలు రాక కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో రోజురోజుకు ప్రవాహ వేగం పెరుగుతోంది. దీంతో పరివాహక ప్రాంతాలపై అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎప్పటికే జిల్లా కలెక్టర్ కోటిపల్లి నుంచి రావులపాలెం వరకు గల గోదావరి ఏటిగట్లను అయిదు రోజుల క్రితమే పర్యవేక్షించారు. కోటిపల్లి నుంచి సందరపల్లి మధ్యలో గోదావరి ఏటిగట్టు ప్రాంతం కొంత బలహీన పడింది. దీంతో ఇక్కడ గల కుమ్మరి సావరం నుంచి గట్టును పటిష్టం చేయాలి వరద నీటి ప్రవాహం పెరిగినప్పుడు కోటిపల్లి నుంచి పర్యాటకులు గోదావరి సందర్శించేందుకు వస్తుంటారు. ప్రస్తుతం గౌతమీ గోదావరి ఎరుపు రంగు సంతరించుకుని పరవళ్ళు తొక్కుతోంది.

'శ్రేష్ట'లో విద్యార్థిని సుజాతకు ఆలిండియా 310 ర్యాంకు

ప్రజాశక్తి-ఆలమూరు

విద్యార్థిని సుజాత

ఆలిం డియా స్థాయి 'శ్రేష్ట'(డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ జస్టిస్ ఎమ్‌పవర్‌మెంట్ స్కీమ్) పోటీ పరీక్షల్లో సందిపూడికి చెందిన విద్యార్థిని సుజాత 310వ ర్యాంకు సాధించిందని గ్రామ సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు శనివారం విలేకరులకు తెలిపారు. నేల చిట్టిబాబు, సునీత దంపతుల కుమార్తె సుజాత జాస్మిన్ స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థలలో ఎనిమిదో తరగతి పూర్తి చేసింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థిని స్వతహాగా ఆన్లైన్ లో అప్లైచేసి 310 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినికి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఉన్న మోసెస్ జోసెఫ్ సికిలి స్కూల్ నందు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సిబిఎస్ఇ ఆంగ్ల మాధ్యమంలో ఉచిత విద్యను అభ్యసించే అవకాశం లభించిందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని సుజాతకు పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, రావులపాలెం గ్రామ డోరు నెం. 95/8, ఫస్ట్ ఫ్లోర్, మల్లిడివారి వీధిలో నివాసం ఉంటున్నాను. ది.13-05-2024వ తేదీన అజ్జరపు శ్రీరామమూర్తి గారి ఇంటిలోనికి ఇల్లు మారినాము. ఇల్లు మారినప్పుడు దస్తావేజు నెం. 376/1981, నెం. 5041/1992, నెం. 3042/1992 ర్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ బ్యాంకులకు సంబంధించినచెరో రెండు చెక్కులు, 6 సంతకములు చేసిన ప్రామిసరీ నోట్లు ఒరిజినల్ దస్తావేజులు గల బ్యాగ్ ఎక్కడో పోయినది. దొరికినవారు కింది అడ్రస్ తెలియజేయగలరు.

సత్తి లక్ష్మీనారాయణ రెడ్డి
C/o. అజ్జవరపు శ్రీరామమూర్తి, 95/8
మల్లిడివారి వీధి, రెండవ రోడ్డు,
రావులపాలెం, ఫోన్ : 9493333336

మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 71/2024

Between:
పోతంశెట్టి వెంకట సత్యనారాయణరెడ్డి -వాది
AND
పలివెల శామ్యూల్ & Another -ప్రతివాదులు

To:
D-2: పలివెల స్మైలీ, D/o. పలివెల శామ్యూల్, వయస్సు 30 సం॥లు, ఎం.పి.ఇ.ఒ., R/o. డోర్ నెం. 1-126, వేగేశ్వరపురం, తాళ్ళపూడి మండలం, ప॥గో॥జిల్లా, ప్రస్తుతం తూ॥గో॥జిల్లా, కొవ్వూరు PJCJ.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు కోర్టుకు హాజరు కమ్మని సమన్లు పంపినన్ను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. సదరు పై నెంబరు దావా మీ హాజరు కొరకు ది.వి. 15-07-2024వ తేదీకి వాయిదా అయ్యి ఉన్నది. కావున **ది.వి. 15-07-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ వాదనలు వినిపించుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

సత్తి సూర్యనారాయణరెడ్డి
సత్తి శ్రీకర్‌రెడ్డి, అడ్వకేట్స్
రామచంద్రపురం, సెల్: 9849483239